# ఆబద్ధం లాంటి నిజం

**-పి. శ్రీనివాసాచారి**

**వీక్లీ తిరగేస్తుండగా 'కలంస్నేహం' శీర్షికలోని ఒక అడ్రస్ దగ్గర ఆగిపోయాయ్ శ్రీధర్ కళ్ళు.**

**కె.శ్రీదివ్య**
**కేరాఫ్ కరుణాకర్**
**ఇం.నెం.6-4-5**
**టౌన్ షిప్**
**బి.హెచ్.ఇ.ఎల్.**

వెంటనే కాగితం, కలం అతని చేతిలో ఉన్నాయ్. అతనికిలాంటి వంటే చాలా సరదా. ఇంత క్రితం ఇద్దరు, ముగ్గురు అమ్మాయిలకి లెటర్లు వ్రాసాడు. కానీ రిప్లై రాలేదు. చివరి ప్రయత్నంగా లెటర్ వ్రాయడం ప్రారంభించాడు.

శ్రీయుత గౌరవనీయులైన శ్రీదివ్యగారికి, నమస్కరించి వ్రాయడం ఏమనగా-

నా పేరు శ్రీకర్ 12-12-97 ఆంధ్ర వార పత్రిక లోని 'కలం స్నేహం' శీర్షికలో మీ పేరు చూసాను. ఎందుకో మీతో ఫ్రెండ్‌షిప్ చేయాలని పించింది. కారణం మీ హాబీస్ కావచ్చు. మీ అందమైన పేరు కావచ్చు. మీ హాబీస్ బావున్నాయనే కంటే నాకు నచ్చాయి అంటే బావుంటుందేమో. ఏదేమైనా మీతో కలం స్నేహం చేయాలనే సదుద్దేశంతో ఈ వుత్తరం వ్రాస్తున్నాను.

'హాబీ లేని జీవితం గుండెలేని మనిషి లాంటిది' అన్నాడో అమెరికన్ రచయిత.

నాకు నచ్చిన హాబీల్లో ఒకటి ఈ కలం స్నేహం. దీంట్లో ఎంతో థ్రిల్ ఉంది. మానసిక ప్రశాంతత దొరుకుతుంది. ఇంకా దీని గురించి ఎంత చెప్పి తక్కువే-

ఇక నా హాబీస్ అంటారా...చలం. శ్రీశ్రీ. మల్లాది, యండమూరి రచనలని ఇష్టపడతాను. అప్పుడప్పుడు ఆంధ్ర వార పత్రిక్కి కవితలు వ్రాస్తూ ఉంటాను. సంగీతం వినడం కూడా నా హాబీల్లో భాగామే. చదువు బి.ఏ ఫైనలియర్. వయసు ఇరవై రెండు సంవత్సరాలు.

మీకు నాతో కలం స్నేహం చేయాలనే ఉద్దేశం ఉంటే ఈ క్రిండి అడ్రస్‌కు లెటర్ వ్రాయండి.

మీ లెటర్ కోసం ఎదురుచూస్తుంటాను. తప్పకుండా వ్రాస్తారు కదూ-

వ్రాయడం ముగించి ఫ్రం అడ్రస్ రాసి పోస్ట్ చేశాడు శ్రీకర్. సరిగ్గా వారం తర్వాత ఆ అమ్మాయి దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. అలా వస్తుందని అతనూహించ లేదు.

"OPEN WITH SMILE " అని ఉన్న లెటర్ పైభాగాన్ని సర్రున చించి లెటర్ ఓపెన్ చేశాడు. అతని కళ్ళు అక్షరాల వెంట పరుగులు తీస్తున్నాయ్.

శ్రీయుత గౌరవనీయులైన శ్రీకర్‌గార్కి-
వ్రాయడం ఇది కదా-

మీరు వ్రాసిన ఉత్తరం అందింది. నా హాబీలు మీకు నచ్చినందుకు కృతజ్ఞురాలిని.

స్నేహలత శీర్షికలో నా పేరు చూసి చాళామంది ఉత్తరాలు వ్రాసారు. కానీ అందులో ప్రత్యేక తరహాలో ఉన్న మీ లెటర్ నాకు నచ్చింది. మీ హాబీలు కూడా నాకు నచ్చాయి.

మీరన్న విషయం నిజమే. 'కలం స్నేహం'లో థ్రిల్ ఉంది. ఎక్కడెక్కడో ఉన్న ఇద్దరు వ్యక్తులు కనీసం ముఖాలు కూడా చూసుకోకుండా స్నేహం చేయడం గొప్ప విషయమే. ఒక్కోసారి లోతుగా ఆలోచిస్తే, నిజమైన ఫ్రెండ్ షిప్- ఇదేనేమో అనిపిస్తుంది.

రోజూ పొద్దున లేస్తూనే పాత వాతావరణం, పాత పద్ధతులు, పాత స్నేహితులు (నా ఉద్దేశం స్నేహితులని కించ పరచాలని కాదు) ఇందులో కాస్తయినా థ్రిల్ లేదు.

జీవితంలో మార్పులేకుండా గానుగెద్దుల్లా బ్రతకడం నా కిష్టముండదు. అటువంటి జీవితం మనుషులని మూడీగా, సోమరులుగా మారుస్తుంది. అలాంటి జీవితాల్లో థ్రిల్ కూడా ఉండదు.

ఇక నా విషయానికొస్తే- నా పుస్తకాలకిచ్చే విలువ నా ఫ్రెండ్స్‌కి కూడా సరిగా ఇవ్వనంటే మీరు నమ్ముతారో లేదో!

నిస్వార్థమైన ప్రేమలాగే 'స్నేహం' కూడా ఓ వ్యక్తి మరో వ్యక్తి కిచ్చే కానుక అని నా అభిప్రాయం.

ఇంతే సంగతులు,
మీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూ...
మీ స్నేహితురాలు
-శ్రీదివ్య

విప్పారిన మొహంతో ఉత్తరాన్ని ముగించాడు శ్రీకర్. ఉండబట్టలేక ముఖంపైకి వస్తున్న సంతోషం, ఒకమ్మాయి స్నేహాన్ని గెలిచానన్న గర్వం కనబడ్తున్నాయ్, అతని ముఖంలో. ఉత్తరాన్ని జాగ్రత్తగా మలిచి వెనకజేబులో ఉంచాడు.

★★★

వాళ్ళిద్దరి మధ్య ఉత్తరాల వారధి 'ప్రేమ'గారి మారి సంవత్సరకాలం గడిచింది.

మధ్యాహ్నం ఒకటీ ముప్పై నిమిషాలు.

మేడమీద బాల్కనీలో నిల్చుని, పోస్ట్‌మెన్ తెచ్చే లెటర్ కోసం అరగంట నుండే ఎదురు చూస్తున్నాడు శ్రీకర్.

గదిలో మోగుతున్న టి.వీలోంచి పాటలేవో లీలగా వినిపిస్తున్నాయ్.

కాఫీ కప్పు తెచ్చి టీపాయ్ మీద ఉంచింది పని మనిషి. కాఫీ సిప్ చేస్తుండగా పోస్ట్ అన్న కేక వినబడ్డంతో గబగబా కిందకు దిగి పోస్ట్‌మెన్ చేతిలో ఉన్న కవర్‌ని లాక్కున్నంత పని చేశాడు శ్రీకర్.

పోస్ట్‌మెన్ వెళ్ళిపోయాక నెమ్మదిగా కవర్ లోంచి చదవడం మొదలు పెట్టాడు.

ప్రియమైన శ్రీకర్‌కు ప్రేమతో శ్రీదివ్య వ్రాయునది ఇదికదా-

నీవు వ్రాసిన ఉత్తరం ఐదు నిమిషాల క్రిత్రమే ముట్టింది.

మన ప్రేమ సంగతి మా ఇంట్లో వాళ్ళకి తెలిసిపోయింది.

ఇలా ముఖాలు చూసుకోకుండా ప్రేమేంటే నీ బొంద. అదేదో సినిమాలోలా నీ కథ సుఖాంత మౌతుందేమో! అనుకుంటున్నావా? అవన్నీ సినిమా హాల్లోనే మరచిపోవాలి.

కావాలంటే ఒకసారి ఆ అబ్బాయిని కలుసుకుని నీకు నచ్చితే చేస్కో. అంటున్నారు ఇంట్లో అమ్మా, నాన్నా.

నాకేమో అలా కలుసుకోవడం ఇష్టం లేదు. కారణం సంవత్సరం నుండీ మన మధ్య పెనవేసుకుపోయిన ఈ థ్రిల్ కావచ్చు. లేదా నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ రూపు రేఖల్నీ, అందాన్నీ కాదు, అన్న భావన కావచ్చు. నీకు నన్ను కలుసు కోవాలని ఉంటే తరువాత లెటర్‌లో వ్రాయి.

నీ లెటర్ కోసం ఎదురు చూస్తూ....
నీ
-శ్రీదివ్య.

ఉత్తరం చదవడం పూర్తి చేసి, అలాగే ఈజీ చెయిర్‌లో వెనక్కి వాలాడు శ్రీకర్.

అరగంట తర్వాత టేబుల్ మీదున్న వైట్ పేజీపై రాయడం మొదలు పెట్టాడు.

మైడియర్ శ్రీదివ్య-

నీ ఉత్తరం అందింది. ఏ ప్రియుడైనా, తన ప్రియురాల్ని కనీసం రోజు కొక్కసారైనా చూడాలని కోరుకుంటాడు. కానీ మనం 'కలం స్నేహం' ద్వారా ప్రేమికుల మయ్యాం. కాబట్టి ఆ అవకాశం నీకు గానీ, నాకు గానీ కలగలేదు.

గత కొద్ది రోజులుగా నాలో నిన్ను చూడాలనే కోరిక అంతర్గతంగా కలుగుతూనే ఉంది. కానీ చెప్పలేకపోయాను.

బహుశా నీవు నన్ను అపార్థం చేసుకుంటావేమోనన్న భయంతో కావచ్చు.

కానీ ఆ ప్రస్తావన ఇప్పుడు వచ్చింది కాబట్టి చెప్పకుండా ఉండలేక పోతున్నాను.

మనిద్దరం కలుసుకోకుండా ఉంటేనే థ్రిల్ అన్నావ్. కావచ్చు, కానీ మనం కలుసుకుంటే అంతకన్నా

మధురమైన తీయని అనుభవాల్ని ఆస్వాదించవచ్చు.

ఎప్పుడో ఒకప్పుడు.... అకస్మాత్తుగా... నీవు నాకు కనబడతావ్..నువ్వేనా ఇన్ని రోజుల్నుండీ-నాకు ఉత్తరాలు రాసిన నా ఊహా సుందరివి, అన్నట్లుగా అనుమానంగా నిన్ను నేను చూస్తాను. అవునన్నట్లుగా నవ్వుతూ నా కళ్ళలోకి సూటిగా చూస్తూ నువ్వు తలాడిస్తావ్. నువ్వలా నా కళ్ళలోకి చూస్తున్న జ్ఞాపకం నాలో కలిగించే ఆనందాన్ని ఆస్వాదించడానికి ఎన్ని యుగాలైనా ఇలాగే నిలబడగలను.

అనుకున్న సమయానికి నీ దగ్గర్నుండి ఉత్తరం రాకపోతేనే వెర్రిగా ఫీలయ్యే నేను, నిన్ను చూడాలని, ఒకసారి వచ్చిన ఆలోచన్ని చంపుకోలేక పోతున్నాను.

అయినా ఎంత కాలం ఇలా ఉత్తరాలు రాసుకోడం. ఎలాగూ మనిద్దరి అభిప్రాయాలూ కలిశాయ్. ఇక మనం భౌతికంగా మాత్రం కలుసుకోవాల్సి ఉంది.

ఇక అందం అంటావా, అది నీడలాంటిది. నిజం ఆ వ్యక్తి మనసు. నేను నిజాన్ని చూసాను కాబట్టి, ఇక నీడతో నాకు పనిలేదు- నువ్వూ అలాగే అనుకుంటున్నావని నాకు తెలుసు. కాబట్టే మనం కలుసుకోవడమే ఉత్తమం. ఎక్కడ కలుసుకోవాలన్నదీ నీవే తేల్చాలి.

నీ లెటర్ కోసం ఎదురు చూస్తూ-

నీ శ్రీకర్

★★★

అరగంట నుండీ సగటు భారత స్త్రీలా అద్దం ముందు ముస్తాబవుతూనే ఉన్నాడు శ్రీకర్. దివ్యని కలుసుకోబోతున్నాననే సంతోషంతో...

సాయంత్రం అయిదు గంటలు..ఇంకా ఇరవై నిమిషాలే టైముంది. ''టాంక్ బండ్ పైనున్న శ్రీశ్రీ, రుద్రమ దేవి, నన్నయ విగ్రహాల్లో ఏ విగ్రహం దగ్గరైనా నేను నీకు కనబడవచ్చు. నన్ను వెతికి పట్టుకునే బాధ్యత మాత్రం నీదే! ఈ పరీక్ష నీకెందుకు పెట్టానో తెలుసా? మనం కలుసుకోబోతున్న శుభసందర్భంలో కాస్త థ్రిల్లింగ్‌గా ఉంటుందని..దివ్య లెటర్‌లో వ్రాసిన మాటల్ని మరోసారి గుర్తు తెచ్చుకున్నాడు. ఈరోజుతనికి పట్టరానంత ఆనందంగా ఉంది. మరో పది నిమిషాల్లో టాంక్‌బండ్ పైనున్న శ్రీశ్రీ విగ్రహం దగ్గర ప్రత్యక్షమయ్యాడు శ్రీకర్ ఉత్సాహంగా..

అతని కళ్ళు లేత గులాబీ రంగు చీర కట్టుకున్న అమ్మాయి కోసం పరిశీలిస్తున్నాయ్.

అంతలో స్కై-బ్లూ సారీ కట్టుకున్న ఓ అమ్మాయి వయ్యారంగా నడుచుకుంటూ అతని ముందు నుండి వెళ్ళిపోయింది.

కానీ అతన్నాకర్షించింది ఆ అమ్మాయి కాదు! ఆమె తల్లో ఉన్న ఎర్రగులాబీ. ఎప్పుడో చదివిన మినీ కవిత గుర్తొచ్చింది. ''నీ జడలో ఒంటరి గులాబీ జంట లేక విలపించేను నాలా'' ఆ మాట నొకసారి తనతో అన్వయించుకొని తాత్కాలికానందం పొందాడు శ్రీకర్.

దివ్య ఇక్కడ లేదంటే మిగతా రెండు విగ్రహాల్లో



ఏదో ఒక విగ్రహం వద్ద ఉంటుంది. ఆలోచిస్తూ ఆత్రంగా రెండో విగ్రహం వైపు నడక సాగిస్తున్నాడు.

వెనక నుండి 'ఎక్స్‌క్యూజ్‌మీ'' అన్న మగగొంతు వినపడ్డంతో వెనక్కి తిరిగాడు శ్రీకర్ పరిశీలనగా చూస్తూ.

వయసు దాదాపు ఇరవై రెండు సంవత్సరాలుండొచ్చు. ముఖంలో గాంభీర్యం, ఏదో ఆతృత ఉన్నాయి.

బాగా ఒడ్డూ పొడుగూ ఉన్న మనిషి కాకపోయినా పొట్టిగా మాత్రం లేడు.

ఏంటన్నట్టుగా చూస్తూ చిన్నగానవ్వాడు.

ఇలా నిలబడి మాట్లాడ్డం బావుండదు. అలా పచ్చగడ్డిలో కూర్చుని మాట్లాడుకుందాం! అదీ మీరనుమతిస్తేనే.... అన్నాడా వ్యక్తి ఆతృత భయం మిళితమైన స్వరంతో-

ఓ పక్క దివ్య తన కిచ్చిన సమయం దాటిపోతుంది.

మరోపక్క ఈ కొత్త వ్యక్తి ''మీతో కాసేపు మాట్లాడాలి'' అంటాడు. ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు శ్రీకర్.

''ఎనీ ప్రాబ్లెమ్'' అన్నాడా వ్యక్తి లోగొంతులో.

ఈ విక్రమార్కుడు నన్నొదిలేలా లేడు! అనుకొంటూ ''నో..నోప్రాబ్లెమ్'' పదండి అన్నాడు శ్రీకర్. ముఖంలోకి నవ్వు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ-

నా పేరు కరుణాకర్. అన్నాడావ్యక్తి పచ్చని గడ్డిలో కూలబడుతూ.

నా పేరు.....

తెలుసు!

ఆశ్చర్యంగా కరుణాకర్ కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తూ-

''నా పేరు మీకెలా తెలుసు'' అన్నాడు శ్రీకర్.

అంతేకాదు నేను మీకిప్పుడు జీర్ణించుకోలేని, ఓ ''అబద్ధం లాంటి నిజాన్ని'' చెబుతాను.

శ్రీకర్ ఉత్సుకతతో కరుణాకర్ వంకే చూస్తున్నాడు. అతను చెప్పబోయే విషయం గురించి.

కరుణాకర్ చెప్పడం మొదలెట్టాడు.

గత సంవత్సరం నుండీ మీకు శ్రీదివ్య పేరుతో లెటర్స్ రాస్తుంది నేనే-

ఒక్కసారిగా శ్రీకర్ గుండెల్లో పిడుగు పడిన ట్లయింది.

క్షమించండి. అందుకు నేను బాధ పడుతున్నాను.

ఇంతక్రితం నేను చాలా మంది అమ్మాయిలకి లెటర్స్ వ్రాశాను. రిప్లైస్ వస్తే టైం పాస్ చేద్దామనుకున్నాను. కానీ ఏ ఒక్కరి దగ్గర్నుండి కూడా రిప్లై రాలేదు. దాంతో కాస్త గిల్టీగా ఫీలయ్యాను. ఆ సమయంలో నాకో వింత ఆలోచన వచ్చింది. మనిషి మనస్తత్వమే అంతగదా!

'స్నేహలత' శీర్షికకి అమ్మాయి పేరుతో కూపన్ పంపాను. ప్రచురణ జరిగింతర్వాత లెటర్స్ కొద్దిమంది నుండే వచ్చాయ్. అందులో చాలావరకు రఫ్‌గా రాసిన వాళ్ళే. అందులో మీ లెటర్ నచ్చింది. వాళ్ళకి రాస్తే థ్రిల్ ఉండదని మీకు వ్రాశాను. అందుకు మరొక్కసారి క్షమాపణ కోరుతున్నాను.

కానీ రాను రానూ మీ ప్రేమలోని నిజాయితీనీ భావోద్రేకాన్నీ, మీ లెటర్లలో గమనించాను. ఇన్నిరోజుల్నుండీ నేను చేస్తున్న తప్పుని గ్రహించగలిగాను.

ఇంకా ఏదో చెప్తూ పోతున్నాడు కరుణాకర్-

శ్రీకర్ మొహంలో ఏ భావనమూ లేదు.

కారణం-

అతడి చెవులెప్పుడో వినడం మానేశాయ్ గనక.

★